సాక్షి
వరంగల్

శుక్రవారం | 4 | ఆగస్టు | 2023






**పసుపు.. పరుగు**

పచ్చ బంగారం ధర పరుగులు పెడుతోంది. పసుపునకు రికార్డు స్థాయిలో గరిష్ట ధర క్వింటాకు రూ.12 వేలకు పైగా పలుకుతోంది.

- 8లో▸



**పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి**

విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఇస్రో మాజీ సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ అపూర్వ కంజిలాల్ అన్నారు.

- 8లో▸

గరిష్టం/కనిష్టం
$33^0/24^0$

**వాతావరణం**

జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అల్పపీడన ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశం ఉంది. సాయంత్రం ఆహ్లాదంగా ఉంటుంది.

# పత్తికి విపత్తు

**భారీ వర్షాలతో జాలువారిన పంట**

- కలుపు మొక్కలతో నిండిన చేలు
- ట్రాక్టర్లతో తొలగిస్తున్న రైతులు
- ప్రత్యామ్నాయ పంటలు వేసేందుకు సమాయత్తం



నల్లబెల్లి మండలం అర్వయ్యపల్లిలో పత్తి పంటలో ఏపుగా పెరిగిన కలుపు మొక్కలు

**నర్సంపేట:** కోటి ఆశలతో పంటలు సాగుచేసిన రైతులకు కుండపోత వర్షాలు భారీనష్టాన్ని మిగిల్చాయి. ఏకధాటిగా కురిసిన వానలకు వాగులు, వంకలు పొంగిపొర్లాయి. చెరువులు అలుగు పోశాయి. వరదతో పంట చేలల్లో ఇసుక మేటలు వేశాయి. భూములు జాలువారి మొక్కల్లో ఎదుగుదల లేక మోడువారాయి. వరంగల్ జిల్లాలో ముఖ్యంగా పత్తి పంటకు తీరని నష్టం వాటిల్లింది. కలుపు మొక్కలు భారీగా పెరిగి పత్తి మొలకలను ఎదగకుండా చేశాయి. దీంతో పత్తి మొక్కలు పిచ్చి మొక్కల్లో పిలకల్లా మారిపోయాయి. కలుపు తీసినా ఖర్చు తప్ప లాభం లేదనుకుంటున్న రైతులు ఏకంగా పంటను తొలగిస్తున్నారు. కలుపు మొక్కలతో కలిపి దున్నుతున్నారు. ప్రత్యామ్నాయ పంటలు వేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

**విత్తనాలు, ఎరువులు, పురుగు మందులకు భారీగా ఖర్చు..**

జిల్లాలో గత ఏడాది 1,28,201 ఎకరాల్లో పత్తి పంట సాగు చేయగా.. ఈసారి 1,30,890 ఎకరాల్లో సాగవుతుందని అధికారులు అంచనా వేశారు. ఇందుకు 2,61,720 పత్తి విత్తన ప్యాకెట్లు అవసరమవుతాయని లెక్కలు వేశారు. విత్తనాలకే కాకుండా రైతులు ఎరువులు, పురుగు మందులకు కూడా వేలాది రూపాయలు వెచ్చించారు.వర్షాలతో పత్తి పంట ఎదగకపోవడంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

**ఇతర పంటలపై మొగ్గు..**

వారం రోజుల పాటు కురిసిన భారీ వర్షానికి కన్నీటిని దిగమింగుకుని ఎదగని పత్తి పంటను ట్రాక్టర్లతో తొలగిస్తున్నారు. వాటి స్థానంలో ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న, వేరుశనగ వేసేందుకు దుక్కులను సిద్ధం చేస్తున్నారు. జిల్లాలో ఈ ఏడాది 13, 861ఎకరాల్లో మొక్కజొన్న సాగవుతుందని అంచనా వేయగా.. ప్రస్తుత పరిస్థితులతో మరింత సాగు పెరిగే అవకాశం ఉంది.

**నాలుగున్నర ఎకరాల్లో పంట తొలగించా..**



నాకు నాలుగున్నర ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ప్రతీ సంవత్సరం పత్తి పంట సాగు చేస్తున్నా. ఈ ఏడాది కూడా విత్తనాలు కొనుగోలు చేసి పత్తి పంట వేశా. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలతో పత్తి మొక్కల కంటే కలుపు మొక్కలు ఏపుగా పెరిగాయి. గుంటుక తోలేందుకు, కూలీలతో కలుపు తీసేందుకు సాధ్యం కావడం లేదు. వేలాది రూపాయల పెట్టుబడి పెట్టి సాగు చేసిన పత్తి పంటను ట్రాక్టర్లతో తొలగించా. తొలగించిన పంట స్థానంలో మొక్కజొన్న సాగు చేస్తా. భారీగా కురిసిన వర్షాలకు ఆర్థికంగా నష్టపోయా. ప్రభుత్వం ఆదుకోవాలి.

– వర్షం శ్రీనివాస్‌రెడ్డి, అర్వయ్యపల్లి, నల్లబెల్లి మండలం

## న్యూస్‌రీల్

### సీఎం కేసీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే అరూరి రమేష్



**వర్ధన్నపేట:** రైతు రుణమాఫీ ప్రకటించినందుకు సీఎం కేసీఆర్‌ను హైదరాబాద్‌లో ఎమ్మెల్యే అరూరి రమేష్ గురువారం కలిశారు. వర్ధన్నపేట నియోజకవర్గ రైతుల తరఫున కృతజ్ఞతలు తెలిపి పుష్పగుచ్ఛం అందించారు. ఆయన వెంట ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ ఉన్నారు.

### గొర్రెల యూనిట్ల పరిశీలన



**గీసుకొండ:** జిల్లాలో గొర్రెల యూనిట్ల పంపిణీని పశువైద్య, సంవర్ధక శాఖ రాష్ట్ర సంయుక్త సంచాలకులు డాక్టర్ కృష్ణమూర్తి గురువారం పరిశీలించారు. గీసుకొండ మండలం (గ్రేటర్ వరంగల్ నగరంలోని 16, 17 డివిజన్ల పరిధి) లోని ధర్మారం, మొగిలిచర్ల, వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని ఖిలావరంగల్, వర్ధన్నపేట నియోజకవర్గంలోని నల్లబెల్లిలో గొర్రెల యూనిట్ల వివరాలు తెలుసుకున్నారు. లబ్ధిదారులను వివరాలు అడిగి, సంబంధిత రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట హైదరాబాద్ నుంచి వచ్చిన డాక్టర్ అరవింద్, జిల్లా పశువైద్య, సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ ఎం.బాలకృష్ణ, జిల్లా సహాయ సంచాలకులు డాక్టర్ బి.ప్రకాశ్, మండల పశువైద్యాధికారి వడ్డేపల్లి రమేశ్, పలువురు అధికారులు ఉన్నారు.

### అదుపు తప్పి లారీ బోల్తా



**నర్సంపేట రూరల్:** అదుపు తప్పి లారీ బోల్తా పడిన సంఘటన సర్వాపురం శివారులో గురువారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. ములుగు జిల్లా మల్లంపల్లికి చెందిన రైస్ మిల్లు నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కాకినాడ వెళ్తున్న బియ్యం లోడు లారీ డ్రైవర్ నిర్లక్ష్యంతో అదుపు తప్పి సర్వాపురం శివారులోని నర్సంపేట–మహబూబాబాద్ 365 జాతీయ రహదారి పక్కనే పడిపోయింది. లారీ డ్రైవర్, క్లీనర్‌కు ఎలాంటి ప్రమాదం కాకపోవడంతో అందరు ఊపిరి పీల్చుకున్నారు.

### సమాన నిధులు కేటాయించాలి

**నర్సంపేట:** నర్సంపేట మునిసిపాలిటీలో అన్ని డివిజన్లకు సమానంగా అభివృద్ధి నిధులు కేటాయించాలని కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్యగౌడ్ కోరారు. ఈ మేరకు గురువారం కలెక్టర్, అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెల 26న జరిగిన నర్సంపేట మున్సిపల్ సర్వసభ్య సమావేశాన్ని ఆరుగురు కాంగ్రెస్ కౌన్సిలర్లు బహిష్కరించి, డీసెంట్ నోట్ అందించినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు ప్రాతినిధ్యం వహిస్తున్న 6 డివిజన్లకు కూడా సమాన నిధులు కేటాయించాలని కోరారు. కౌన్సిలర్లు ఎలకంటి విజయ్‌కుమార్, బత్తిని రాజేందర్, పెండెం లక్ష్మీరామానంద్, ములుకల వినోద సాంబయ్య, ఓర్సు అంజలి అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

### గుణాత్మక విద్యనందించాలి



**గీసుకొండ:** ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు ప్రతీ సబ్జెక్టులో రెండు రోజుల శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకుని విద్యార్థులకు గుణాత్మక విద్యనందించాలని డీఈఓ వాసంతి సూచించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న తొలిమెట్టు 2.0 శిక్షణ తరగతులను గురువారం ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ ఎం.బాలకుమార్, అసిస్టెంట్ కోఆర్డినేటర్ జి.జ్యోత్స్నప్రభ, ఆర్పీలు జి. లక్ష్మీపతి, ఎస్.పద్మ పాల్గొన్నారు.

### మెరుగైన విద్య కోసమే శిక్షణ తరగతులు

**దుగ్గొండి:** ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యనందించడం కోసమే శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తొలిమెట్టు రాష్ట్ర పరిశీలకుడు శ్రీనివాస్ అన్నారు. తొలిమెట్టు–2 కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో రెండు రోజులుగా జరుగుతున్న శిక్షణ తరగతులను గురువారం ఆయన పరిశీలించారు. జిల్లా పరిశీలకుడు నాగేశ్వర్‌రావు, ఎంఈఓ సత్యనారాయణ, నోడల్ అధికారి వెంకటేశ్వర్లు, ఆర్పీలు నర్సింహులు, కైలాసం పాల్గొన్నారు.

## పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేయాలి

- కలెక్టర్ ప్రావీణ్య

**ఖిలా వరంగల్:** నులిపురుగుల నిర్మూలనపై తల్లిదండ్రులు, విద్యార్థులను చైతన్యం చేయాలని కలెక్టర్ ప్రావీణ్య సూచించారు. ప్రతి విద్యార్థి చదువుపై శ్రద్ధ చూపాలని, ఆరోగ్యకరమైన అలవాట్లను అలవర్చుకోవాలని పేర్కొన్నారు. ఖిలావరంగల్ మధ్యకోటలోని ఆరెల్లి బుచ్చయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో డీఎంహెచ్‌ఓ వెంకటరమణ ఆధ్వర్యంలో గురువారం జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని నిర్వహించారు. డీఐఓ గీతాలక్ష్మి, డీటీసీఓ హిమబిందు, డీఈఓ వాసంతి, కార్పొరేటర్ బైరబోయిన ఉమతో కలిసి కలెక్టర్ విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ ఒక సంవత్సరం నుంచి 19 సంవత్సరాల పిల్లలందరు తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలు విధిగా వేసుకోవాలని సూచించారు. జిల్లాలో 1,91,380 మంది పిల్లలు ఉన్నారని, వీరికి వైద్య ఆరోగ్య శాఖ అధికారులు మాత్రలు వేయాలని ఆదేశించారు. డీఎంహెచ్‌ఓ కె.వెంకటరమణ మాట్లాడుతూ నులిపురుగులు కొన్ని సందర్భాల్లో మెదడులో చేరితే పిల్లలకు ప్రాణాపాయం కలుగుతుందని తెలిపారు. ఏఎంసీ చైర్‌పర్సన్ గీత, జిల్లా ఇమ్యూనైజేషన్ ఆఫీసర్ డాక్టర్ మధుసూదన్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ గోపాల్‌రావు, స్థానిక వైద్యాధికారి ప్రసాద్, డాక్టర్ రవీందర్, డీపీఓ అర్చన, హెచ్‌ఎం శైలేంద్ర, హెచ్‌ఎం గంప అశోక్‌కుమార్, మాజీ కార్పొరేటర్ దామోదర్‌యాదవ్ పాల్గొన్నారు.



ఖిలావరంగల్ : విద్యార్థికి ఆల్బెండజోల్ మాత్ర వేస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

**నులిపురుగులను నివారించాలి**

**కాశిబుగ్గ:** జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని క్రిస్టియన్ కాలనీలోని గ్రెయిన్ మార్కెట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. డీఈఓ వాసంతి విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేసి మాట్లాడారు. హెచ్‌ఎం నరసింహరావు, కీర్తినగర్ యూపీహెచ్‌సీ వైద్యురాలు అర్చన, ఉపాధ్యాయులు వేణుగోపాలాచారి, తిరుపతి, అనిత, రమేష్, రామనాథం పాల్గొన్నారు.

**90 శాతం మందికి ఆల్బెండజోల్ టాబ్లెట్లు**

**గీసుకొండ:** జిల్లాలో ఆల్బెండజోల్ మాత్రలు వేసే కార్యక్రమం విజయవంతమైందని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కె.వెంకటరమణ తెలిపారు. జిల్లాలో 1,91,380 మంది విద్యార్థులు అర్హులు కాగా.. వారిలో 1,72,354 మందికి(90.06 శాతం)మందికి టాబ్లెట్లు వేశామని, మిగిలిన వారికి ఈ నెల 10న ప్రత్యేకంగా వేస్తామని ఆయన పేర్కొన్నారు.

## జెడ్పీ సీఈఓగా రాంరెడ్డి



**వరంగల్:** జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారిగా జి.రాంరెడ్డి నియమితులయ్యారు. జనగామ డీఆర్‌డీఓగా పనిచేస్తున్న ఆయనను వరంగల్ జెడ్పీ సీఈఓగా నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. సుమారు ఏడాదిన్నరగా ఖాళీగా ఉన్న సీఈఓ పోస్టును ప్రభుత్వ భర్తీ చేసింది.

## బీఆర్‌ఎస్‌కు గుణపాఠం చెప్పాలి

- ధనిక రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చిన సీఎం కేసీఆర్
- మాజీ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



దీక్షలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

**నర్సంపేట రూరల్:** ధనిక రాష్ట్రాన్ని సీఎం కేసీఆర్ అప్పులకుప్పగా మార్చారని బీజేపీ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి విమర్శించారు. పేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ముత్తోజిపేట గ్రామంలో బీజేపీ మండల అధ్యక్షుడు కొత్త శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొమ్మిదేళ్లు గడిచినా నర్సంపేట నియోజకవర్గంలో ఒక ఇల్లు కట్టిన దాఖలాలు లేవన్నారు. దళితుడిని ముఖ్యమంత్రి చేస్తామని, దళితులకు మూడెకరాల భూమి ఇస్తామని దగా చేశారని పేర్కొన్నారు. ఎన్నికలు వచ్చినప్పుడు కొత్త పథకాల పేరుతో మభ్యపెడుతున్నారని ఆరోపించారు. అందులో భాగంగానే లక్ష రూపాయల రుణమాఫీ తెరపైకి తీసుకొచ్చారని, ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తున్నట్లు ప్రకటించారని తెలిపారు. రుణమాఫీ చేయకపోవడంతో రైతుల వడ్డీ పెరిగిపోయిందని, అసలు, వడ్డీ మొత్తం మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు బీఆర్‌ఎస్‌కు సరైన గుణపాఠం చెప్పాలని కోరారు. నర్సంపేట నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని, మరోసారి అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు జాటోత్ సంతోష్‌నాయక్, గటిక అజయ్‌కుమార్, వడ్డేపల్లి నర్సింహరాములు, బాల్నె వెంకన్న, మండ కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

## సౌర విద్యుత్‌కు స్త్రీనిధి రుణాలు

- యూనిట్ల ఏర్పాటుకు ముందుకు రావాలి
- స్త్రీనిధి రీజినల్ మేనేజర్ సైదిరెడ్డి

**గీసుకొండ:** స్త్రీనిధి రుణాలతో సబ్సిడీపై సౌర విద్యుత్ యూనిట్లు ఏర్పాటు చేసుకోవడానికి పొదుపు సంఘాల మహిళలు ముందుకు రావాలని స్త్రీనిధి రీజినల్ మేనేజర్ (ఆర్ఎం) సైదిరెడ్డి సూచించారు. జాతీయ ఉత్తమ గ్రామపంచాయతీ మరియపురంలో సెర్ప్ స్వయం సంఘాల మహిళలకు సౌర విద్యుత్‌పై గురువారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. గతంలో స్త్రీనిధి కింద రుణాలు తీసుకున్న మహిళలకు కూడా సౌర విద్యుత్ కోసం రుణాలు ఇస్తామన్నారు. 2 కేవీ కెపాసిటీ యూనిట్ ధర రూ.1,44,000 కాగా ఇందులో సబ్సిడీ పోగా లబ్ధిదారులు 1,15,000 రూపాయలు 60 సులభ వాయిదాల్లో చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

కుటుంబ అవసరాలకు పోగా మిగిలిన కరెంట్‌ను విద్యుత్ శాఖకు అమ్ముకోవచ్చన్నారు. రెడ్‌కో డివిజనల్ మేనేజర్ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ పొదుపు సంఘాల మహిళలు ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీని ఉపయోగించుకుని సోలార్ విద్యుత్ యూనిట్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. సర్పంచ్ అల్లం బాలిరెడ్డి మాట్లాడుతూ సోలార్ విద్యుత్ యూనిట్ ఏర్పాటు చేసుకోవడానికి ముందుకు వచ్చే ఒక్కొక్కరికి తాను సొంతంగా రూ. 20 వేల సాయం చేస్తానని, గ్రామంలోని 20 ఎస్‌హెచ్‌జీలు ఉండగా కనీసం 50 మంది యూనిట్ల ఏర్పాటుకు ముందుకు రావాలని కోరారు. సెర్ప్ ఏపీఎం సురేశ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి స్వప్న, ఏపీఓ బిట్ల జ్యోతి, అడ్డాల లలిత పాల్గొన్నారు.



మరియపురంలో మాట్లాడుతున్న స్త్రీనిధి రీజినల్ మేనేజర్ సైదిరెడ్డి

## మద్యం షాపుల రిజర్వేషన్లకు డ్రా



డ్రా తీస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

**కరీమాబాద్:** జిల్లాలోని మద్యం షాపుల రిజర్వేషన్లకు కలెక్టర్ ప్రావీణ్య గురువారం డ్రా తీశారు. 2023–25కు సంబంధించి ఏ–4 మద్యం దుకాణాల్లో గౌడ, ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు కల్పించారు. అందులో భాగంగా జిల్లాలోని 63 మద్యం షాపుల్లో గౌడలకు 14, ఎస్సీలకు 6, ఎస్టీలకు 2 కేటాయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం కమిటీ సభ్యుల సమక్షంలో డ్రా తీసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు డీపీఈఓ లక్ష్మణ్ నాయక్, డీటీడీఓ ప్రేమకళ, డీబీసీడబ్ల్యూఓ పుష్పలతరెడ్డి, డీఎస్‌సీడీఓ భాగ్యలక్ష్మి, డిప్యూటీ కమిషనర్ అంజన్‌రావు, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

## పండ్ల తోటల పెంపకానికి రైతులను ప్రోత్సహించాలి

**కరీమాబాద్:** ఉపాధి హామీ పథకంలో భాగంగా పండ్ల తోటలను పెంచేలా రైతులను ప్రోత్సహించాలని కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. శనివారం వరకు లబ్ధిదారుల ఎంపికను పూర్తి చేయాలని ఎంపీడీఓలకు సూచించారు. అడిషనల్ కలెక్టర్, డీఆర్‌డీఏ పీడీ, వ్యవసాయ, ఉద్యాన శాఖకు చెందిన వ్యవసాయ విస్తరణ అధికారులు, వ్యవసాయ సంచాలకులు, ఎంపీడీఓలతో గురువారం కలెక్టర్ గూగుల్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతు బీమా దరఖాస్తుకు ఈనెల 5 చివరి తేదీ అని తెలిపారు. 14 ఆగస్టు 1964 నుంచి 14 ఆగస్టు 2005 మధ్యలో జన్మించిన అర్హులైన రైతులకు బీమా చేయించాలని ఆదేశించారు. చనిపోయిన రైతుల వివరాలను జాప్యం చేయకుండా బీమా కంపెనీకి పంపించాలని సూచించారు. పీఎం కిసాన్‌కు సంబంధించి ఇంకా ఈకేవైసీ చేయించుకోని రైతులను గుర్తించి ఈకేవైసీ చేయించాలని చెప్పారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల షాపులను పూర్తిస్థాయిలో తనిఖీ చేయాలని, నాట్లు వేస్తున్నందున విస్తరణ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. పంటల వారీగా నమోదు కార్యక్రమం త్వరగా పూర్తి చేయాలని, ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించాలని, పంట నమోదు పూర్తి చేయాలని సూచించారు. ఎరువుల ప్రస్తుత నిల్వలు, మండలాల వారీగా ఎక్కడైనా అవసరం ఉంటే జిల్లా వ్యవసాయ శాఖ అధికారికి తెలియజేసి, అన్ని గ్రామాల్లో రైతులకు ఎరువులు అందుబాటులో ఉండే విధంగా చూడాలని చెప్పారు. ఈ పాస్ మిషన్ ద్వారా మాత్రమే ఎరువుల అమ్మకాలు జరిగేలా చూడాలని, అమ్మకాల క్లియరెన్స్ ఎప్పటికప్పుడు చేసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు.

## 6 లక్షల గ్రామాలకు ‘బ్రాడ్ బ్యాండ్’

- ట్రాయ్ కాగ్ సభ్యురాలు కల్లెపు శోభారాణి
- టెలికం సేవలపై అవగాహన సదస్సు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న శోభారాణి

**నెక్కొండ:** దేశంలో 2025 నాటికి 6 లక్షల గ్రామాలకు బ్రాడ్‌బ్యాండ్ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు టెలికం రెగ్యులేటరీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) కృషి చేస్తోందని ట్రాయ్ కాగ్ రాష్ట్ర సభ్యురాలు కల్లెపు శోభారాణి తెలిపారు. నెక్కొండలోని షాదీఖానాలో ట్రాయ్ న్యూఢిల్లీ సహకారంతో టెలికం వినియోగదారులు, మహిళలకు గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. భారత ప్రభుత్వం 1997లో టెలికామ్ రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా చట్టాన్ని తీసుకొచ్చిందన్నారు. టెలికం రంగంలో ప్రపంచంలోనే భారత్ రెండో స్థానంలో ఉందని వెల్లడించారు. మొబైల్ నంబర్ పోర్టబిలిటీని 2006లో తీసుకురాగా, ఇప్పటివరకు 48 కోట్ల మంది వినియోగించుకున్నారని వివరించారు. అవాంఛిత కాల్స్ మొబైల్ వినియోగదారులకు ప్రధాన సమస్యగా ట్రాయ్ గుర్తించిందని, 1909 నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేస్తే ఆ నంబర్ బ్లాక్ చేస్తామన్నారు. అలాగే, టెలిమార్కెటింగ్ కాల్స్‌కు అడ్డుకట్ట వేసేందుకు డూ నాట్ డూ డీఎన్‌డీ అనే యాప్‌ను డౌన్‌లోడ్ చేసి, అందులో తమ నంబర్‌ను నమోదు చేసుకుంటే అనవసర కాల్స్ రావని శోభారాణి తెలిపారు. మొబైల్ వినియోగదారులు టెలికాం సంస్థల నుంచి ఉత్తమ సేవలు పొందేలా ఈ తరహా సదస్సులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సదస్సులో కాగ్ కోఆర్డినేటర్ ఈదునూరి రమేష్, మహిళా సమాఖ్య మండల అధ్యక్షురాలు మార్త లావణ్య, మాజీ అధ్యక్షురాలు కొమ్మారెడ్డి రుక్మిణిరెడ్డి, గ్రామ వార్డు సభ్యురాలు సుల్తానాబేగం, వీఓ అధ్యక్షురాలు శ్రీదేవి, రేణుక, మానస పాల్గొన్నారు.

## తహసీల్దార్లకు పోస్టింగ్

**కరీమాబాద్:** జిల్లాలో 11 మంది తహసీల్దార్లకు గురువారం పోస్టింగ్ ఇచ్చారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా తహసీల్దార్ల బదిలీలు జరిగిన విషయం తెలిసిందే. ఈక్రమంలో జిల్లాకు బదిలీపై వచ్చిన వారికి పోస్టింగ్ ఇచ్చారు. మహమ్మద్ ఇక్బాల్ (వరంగల్), ఎండీ. రియాజుద్దీన్ (గీసుకొండ), వి.విజయ్‌సాగర్ (పర్వతగిరి), ఎం.శ్రీనివాస్ (రాయపర్తి), ఎల్.రవిచంద్రారెడ్డి (దుగ్గొండి), విశ్వప్రసాద్ (నర్సంపేట), పి.కిరణ్‌కుమార్ (ఖానాపురం), బి.రాజేష్ (నల్లబెల్లి), జి.రాజ్‌కుమార్ (సంగెం), బి.నాగేశ్వర్‌రావు (ఖిలావరంగల్), పీఎస్.ఫణికుమార్ (వర్ధన్నపేట) తహసీల్దార్లుగా నియమితులయ్యారు. తహసీల్దార్లు కలెక్టర్ ప్రావీణ్యను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

## రానున్న రోజులు కాంగ్రెస్‌వే..



మరియపురంలో పార్టీలో చేరిన వారితో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు స్వర్ణ, వెంకట్రాంరెడ్డి తదితరులు


- పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ

**గీసుకొండ:** రానున్న రోజులు కాంగ్రెస్‌వే అని, ఈసారి రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఖాయమని పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ ధీమా వ్యక్తం చేశారు. మరియపురంలో పలువురు బీఆర్‌ఎస్ నుంచి గురువారం కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కార్యకర్తలు అధైర్యపడకుండా పార్టీ కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇనగాల వెంకట్రాంరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కర్నాటక అసెంబ్లీ ఫలితాలు పునరావృతం అవుతాయని ధీమా వ్యక్తం చేశారు. మరియపురం మాజీ సర్పంచ్ నిర్మలామేరీ, ఆమె భర్త జోజిరెడ్డి, తుమ్మ ఇన్నారెడ్డి, భాస్కర్, చామల జోజిరెడ్డి, మోహన్‌రావు, శ్రీనివాస్, ప్రకాశ్‌రెడ్డితో పాటు పలువురు కాంగ్రెస్‌లో చేరారు. ఎంపీపీ భీమగాని సౌజన్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తుమ్మనపల్లి శ్రీనివాస్, జిల్లా నాయకులు చాడ కొమురారెడ్డి, సాయిలి ప్రభాకర్, కూసం రమేష్, కరుణాకర్, నాగారపు స్వామి, రుద్రప్రసాద్, వజ్ర రాజు, దూల వెంకటేశ్వర్లు, ఎండీ రహీం పాల్గొన్నారు.

## నకిలీ పురుగు మందుల విక్రేతపై కేసు

**చెన్నారావుపేట:** నకిలీ పురుగు మందులు విక్రయిస్తున్న వ్యక్తిపై గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తోట మహేందర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఉప్పరపల్లికి చెందిన అనుముల భాస్కర్ గ్రామ రైతులకు కొన్ని రోజులుగా నకిలీ పురుగు మందులు విక్రయిస్తున్నాడు. సమాచారం తెలుసుకున్న వ్యవసాయ అధికారి సూర్యనారాయణ తన సిబ్బందితో కలిసి భాస్కర్ ఇంటిలో తనిఖీలు చేశారు. సుమారు 19 లీటర్ల రెండు రకాల పురుగుల మందును గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వాటిని పోలీస్ స్టేషన్‌లో అప్పగించారని పేర్కొన్నారు. వ్యవసాయ అధికారి ఫిర్యాదు మేరకు భాస్కర్‌పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## దివ్యాంగులకు లైసెన్స్‌లు ఇవ్వాలి



ఆర్టీఓ ఆఫ్రీన్‌సిద్దిఖీకి వినతిపత్రం అందజేస్తున్న దివ్యాంగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ.అజీం

**ఖిలా వరంగల్:** త్రిచక్ర వాహనాల మాదిరిగానే 2, 4 వీలర్స్ నడిపే దివ్యాంగులకు లైసెన్స్‌లను జారీ చేయాలని దివ్యాంగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ ఆజీం, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బండి చక్రపాణి, అంబటి రాజేందర్ కోరారు. ఈమేరకు గురువారం వరంగల్ జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో ఆర్టీఓ ఆఫ్రీన్‌సిద్దిఖీని కలిసి వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. త్రిచక్ర వాహనాల తరహాలో 2, 4 వీలర్స్ నడిపే దివ్యాంగులకు అర్హత పరీక్షలు నిర్వహించి డ్రైవింగ్ లైసెన్స్‌లు జారీ చేయాలని కోరారు. ఇందుకోసం ఆర్టీఓ సానుకూలంగా స్పందించారని, ఉన్నతాధికారులతో చర్చించి సమస్య పరిష్కారానికి ప్రయత్నిస్తానని ఆమె హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఎంవీఐ రవీందర్, దివ్యాంగులు గై సతీష్, బత్తిని రాజు, అబ్దుల్ షబ్బీర్, ఎండీసాదిక్, అసద్, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

## మొక్కలను కాపాడాలి : డీఆర్‌డీఓ

**సంగెం:** మొక్కలను కాపాడాలని డీఆర్‌డీఓ మట్టపల్లి సంపత్‌రావు సూచించారు. మండలంలోని గాంధీనగర్, తీగరాజుపల్లి గ్రామాలను గురువారం ఆయన సందర్శించారు. దశాబ్ది వన సంపద, హరితహారంలో భాగంగా కెనాల్ ప్లాంటేషన్‌ను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు ఎండిపోకుండా, పశువులు మేయకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రావు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.




గాంధీనగర్‌లో దశాబ్ది వన సంపద వనాన్ని పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ సంపత్‌రావు

# రుణమాఫీ.. అన్నదాత హ్యాపీ

- వరంగల్ డీసీసీబీలో మొత్తం రుణమాఫీ రూ.283.97 కోట్లు
- మొదటి విడతలో రూ.6.49 కోట్లు
- రెండో విడతలో రూ.16.50 కోట్లు..

హన్మకొండ : రాష్ట్ర ప్రభుత్వం 2018లో ప్రకటించిన రుణమాఫీ పథకం కింద వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ)కి పరిధిలోని 70 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా మొత్తం 66,400 మంది రైతులు రూ.283.97 కోట్ల మేర రుణమాఫీ ద్వారా లబ్ధి పొందుతున్నారు. అయితే ప్రభుత్వం ఇప్పటి వరకు రెండు విడతల్లో రుణమాఫీ చేసింది. మొదటి విడతలో రూ.25 వేల లోపు రుణమాఫీ చేసింది. రెండు విడతలో రూ.50 వేల లోపు రుణాలు మాఫీ చేసింది. ఆ తర్వాత రుణమాఫీ నిలిచిపోయింది. ప్రస్తుతం ఎన్నికలు సమీపించిన తరుణంలో ప్రభుత్వం రూ.లక్షలోపు రుణమాఫీ చేయాలని, ఈ నెల 3 నుంచి సెప్టెంబర్ 17లోపు పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఇన్ని రోజులు రుణమాఫీ అవుతుందో లేదోననే నిరాశ ఉన్న రైతుల్లో ఒక్కసారిగా సంతోషం నెలకొంది. వరంగల్ డీసీసీబీలో ఇప్పటి వరకు రూ.25 వేలలోపు రుణాలు మొదటి విడత కింద 11,430 మంది రైతులకు రూ 6.49 కోట్ల రుణమాఫీ జరిగింది. రూ.50 వేలలోపు రుణాలు రెండో విడత కింద 4462 మంది రైతులు రూ.16.50 కోట్లు లబ్ధి పొందారు. ఇప్పటివరకు రెండు విడతలలో కలిపి 15892 మంది రైతులకు రూ.23.01 కోట్లు రుణమాఫీ జరిగింది. డీసీసీబీ ప్రభుత్వానికి సమర్పించిన రుణ మాఫీ మొత్తంలో రెండు విడతలలో విడుదలైన రుణమాఫీ పోను ఇంకా 27542 మంది రైతులకుగాను రూ.220.96 కోట్లు రుణమాఫీ జరుగాల్సి ఉంది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో వీరంత రుణ విముక్తులు కానున్నారు.

# నేటినుంచి సాహిత్యోత్సవాలు..

- నాలుగు రోజుల పాటు నిర్వహణ
- వలు గ్రంథాల ఆవిష్కరణ, సాహితీవేత్తల ప్రసంగాలు

హన్మకొండ కల్చరల్ : వరంగల్ సహృదయ సాహిత్య సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి 7వ తేదీ వరకు సాహిత్యోత్సవాలు నిర్వహిస్తున్నామని సహృదయ సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు గన్నమరాజు గిరిజామనోహరబాబు, కుందావజ్ఝల కృష్ణమూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండ వడ్డేపల్లిరోడ్ మండల కార్యాలయం పక్కన ఉన్న పీఆర్ రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో రోజూ సాయంత్రం 6గంటలకు కార్యక్రమాలు ప్రారంభమవుతాయని తెలిపారు. నాలుగు రోజుల పాటు జరిగే కార్యక్రమాలలో భాగంగా మొదటిరోజు హైదరాబాద్ తెలంగాణ సారస్వత పరిషత్ అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి ముఖ్యఅతిథిగా, విశిష్ట అతిథులుగా పరిషత్ కార్యదర్శి డాక్టర్ జుర్రు చెన్నయ్య , ప్రముఖ వైద్యుడు సురవరం కృష్ణవర్ధన్ పాల్గొని దివంగత సురవరం ప్రతాపరెడ్డి రచించిన హైందవ ధర్మవీరులు గ్రంథావిష్కరణ చేస్తారు. 5న శనివారం రిటైర్డ్ దేవాదాయధర్మాదాయ శాఖ కమిషనర్ నందివెలుగు ముక్తేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరై దివంగత రాళ్లబండి కవితాప్రసాద్ స్మారకంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ఐజీపీ, రచయిత రావులపాటి సీతారామరావుకు సహృదయానుబంధ పురస్కారం అందజేయనున్నారు. 6న దివంగత ధరిపల్లి వెంకట నరసింహాచార్య రచించిన పురాణవైర గ్రంథమాల - జ్ఞాన విజ్ఞానం గ్రంథావిష్కరణ జరుగనుంది. ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగుశాఖ ఆచార్యుడు సాగి కమలాకర శర్మ ముఖ్యఅతిథిగా, కరీంనగర్‌కు చెందిన అష్టావధాని డాక్టర్ గంగ్ర లక్ష్మణరావు, ధరిపల్లి రఘురామ్ విశిష్ట అతిథులుగా పాల్గొంటారు. చివరి రోజు 7న కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత డాక్టర్ అంపశయ్య నవీన్ ముఖ్యఅతిథిగా, సాహితీవేత్త గంటా రామిరెడ్డి, మాధవి, రాధిక విశిష్టఅతిథులుగా హాజరై దివంగత వే. నరసింహారెడ్డి రచించిన సవిత కవిత సంకలనం ఆవిష్కరణ చేయనున్నారు. ఈ సందర్భంగా వైభవంగా జరిగే సాహిత్యోత్సవాలలో కవులు, రచయితలు, నగర ప్రజలు , సాహిత్యఅభిమానులు పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.







# పసుపు.. పరుగు

## మార్కెట్‌లో పంట ధరకు రెక్కలు

- క్వింటాల్‌కు రూ.12వేల పైనే..
- దాచుకున్న వారికే 'పచ్చ' బంగారం
- ఆనందంలో అన్నదాతలు

**పచ్చ బంగారం పసుపు ధర పరుగులు పెడుతోంది. నెలరోజుల నుంచి వ్యవసాయ మార్కెట్‌లలో జెట్ స్పీడ్‌తో దూసుకెళ్తోంది. రికార్డు స్థాయిలో క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.12వేలకు పైగా పలుకుతోంది. దీంతో ఇన్నిరోజులు దాచుకుని నిరీక్షిస్తున్న రైతులకు బంగారంగా మారడంతో వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.**

కేసముద్రం : కొన్నేళ్లుగా మార్కెట్‌లో పసుపుకు సరైన ధర లేక రైతులు నిరాశ చెందుతూ వచ్చారు. ఓ పక్క సరైన ధర, దిగుబడి లేక.. మరోవైపు పెట్టుబడులు లేక.. పసుపు రైతులు ఇతర పంటల సాగుపై దృష్టిసారించారు. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా పసుపు సాగు విస్తీర్ణం అమాంతం పడిపోయింది. మార్కెట్‌లో పసుపు సీజన్ చివరి దశలో ధర ఒక్కసారిగా పెరుగుతూ క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.12వేలకు పైగా పలుకుతోంది. దీంతో ఇన్నిరోజులు దాచుకుని నిరీక్షిస్తున్న రైతులకు బంగారంగా మారింది. ఇదిలా ఉండగా ఇప్పటికే 95 శాతం మంది రైతులు ఎప్పటిలాగే ధర పెరగదనే ఉద్దేశంతో మార్కెట్‌లో తక్కువ ధర రూ.5 నుంచి రూ.6వేల వరకు అమ్ముకుని నష్టపోయారు. మిగతా రైతులు గిట్టుబాటు ధర కోసం ఎదురుచూస్తూ పసుపును దాచుకున్నారు. మరికొందరు రైతులు ధర కోసం ఏకంగా నాలుగేళ్లకు పైగా పసుపు శీతలగోదాంలో, ఇళ్లల్లో భద్రపరుచుకున్నారు. ఈ క్రమంలో నెలరోజులుగా వ్యవసాయ మార్కెట్‌లలో పసుపు ధరలకు రెక్కలొస్తున్నాయి. ఈ మేరకు కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో గురువారం క్వింటాల్ పసుపు కాడిరకానికి గరిష్ట ధర రూ.12 వేలు దాటింది. ఇక్కడి మార్కెట్‌లో ఈ యేడాది మార్చి నుంచి పసుపు సీజన్ ప్రారంభం కాగా, మొదట్లో క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.5 నుంచి రూ.6వేల వరకు పలికింది. ఈ క్రమంలో నెలరోజుల క్రితం ఈ మార్కెట్‌లో క్వింటాకు గరిష్ట ధర రూ.10 వేలకు చేరింది. ఆ తర్వాత రోజురోజుకూ ధర పెరుగుతూ గరిష్ట ధర రూ.12వేలకు పైగా పలుకుతోంది.


కేసముద్రం మార్కెట్‌లో పసుపు రాశులు

### పసుపుకు బదులు ఇతర పంటలు..

మరోవైపు.. ఇక ధర పెరగదనే ఉద్దేశంతో పలువురు రైతులు తక్కువ ధరకు అమ్ముకోవడంతోపాటు పసుపు పంటకు బదులు ఇతర పంటలను సాగు చేస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో పసుపు ధర పరుగులు పెడుతుండడంతో వారు అయోమయానికి గురవుతున్నారు. కాగా పసుపు సాగులో రాష్ట్రంలోనే కేసముద్రం మండలానికి ప్రత్యేక గుర్తింపు ఉంది. 2015 వరకు కేసముద్రంలో 6 వేల ఎకరాలకు పైగా పసుపు సాగు విస్తీర్ణం ఉండగా, ఆ తర్వాత పసుపుకు ధరలేక, మరోవైపు దిగుబడులు రాకపోవడంతో క్రమక్రమంగా పంట విస్తీర్ణం తగ్గుతూ వచ్చింది. ఈ మేరకు ఈ వానాకాలం కేవలం 150 ఎకరాల్లో మాత్రమే పసుపు పంట సాగు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇక మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా 1000 ఎకరాల వరకు పసుపు సాగు చేయనున్నట్లు అధికారులు అంచనా వేశారు. ఇదే రీతిలో రాష్ట్ర వ్యాప్తంగా పసుపు సాగు చేసే ప్రాంతాల్లో విస్తీర్ణం అమాంతం తగ్గిపోయింది.

**కేసముద్రం మార్కెట్‌కు వచ్చిన పసుపు, ధర వివరాలు**

| సంవత్సరం | క్వింటాళ్లు | గరిష్ట ధర | కనిష్ట ధర |
|---|---|---|---|
| 1)2018-19 | 85,378 | రూ.7,713 | రూ.4,000 |
| 2)2019-20 | 1,22,931 | రూ.6,659 | రూ.3,109 |
| 3)2020-21 | 9,7083 | రూ.8,081 | రూ.3,011 |
| 4)2021-22 | 62,646 | రూ.7,811 | రూ.2,952 |
| 5)2022-23 | 54,845 | రూ.11,352 | రూ.7,801 |

### క్వింటాల్ పసుపు రూ.5,500కే అమ్ముకున్నా..



గతంలో 2 ఎకరాల్లో పసుపు పంట సాగు చేసేది. కానీ ధర లేకపోవడంతో ఈ యేడాది ఎకరం భూమిలో సాగు వేశా. పంటకు తెగుళ్లు సోకడంతో కేవలం 2.60 క్వింటాళ్లు మాత్రమే చేతికి వచ్చింది. మార్కెట్‌లో క్వింటాల్‌కు రూ.5,500కే ఖరీదు చేశారు. ఎలాగు ధర పెరగదనే ఉద్దేశంతో తక్కువ రేటుకే అమ్ముకున్నా. ఎలాగు పసుపు రేటు పెరగదని విత్తనం పసుపు కూడా అమ్మిన. ఈసారి అరెకరంలోనే సాగు చేస్తున్నా. ఇప్పుడు మార్కెట్‌లో పసుపుకు ఒక్కసారిగా ధర పెరుగుతాంది. పంట వేద్దామంటే అదునుదాటింది.

-సామ ప్రభాకర్, రైతు, అమీనాపురం

### దాచుకోవడమే కలిసొచ్చింది



కొన్నేళ్లుగా పసుపు పంట సాగు చేస్తున్నా. కానీ మార్కెట్‌లో ధర పెరగకపోవడంతో నిరాశ చెందా. 3 ఎకరాల్లో పసుపు సాగు చేస్తే 50 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. అలా రెండేళ్లపాటు పండిస్తే, చేతికివచ్చిన 100 క్వింటాళ్ల పసుపును ఇంట్లోనే దాచిపెట్టా. మార్కెట్‌లో ధర లేకపోవడంతో దాదాపు నాలుగేళ్ల పాటు అలాగే ఉంచా. అలా దాచుకోవడమే నాకు కలిసొచ్చింది. ఒక్కసారిగా పసుపు ధర రూ.12వేలు దాటడంతో సంతోషం కలిగించింది.

-కాటం రాంరెడ్డి, రైతు కేసముద్రంవిలేజ్

### క్వింటాల్ పసుపునకు రూ.12,213



ఈ ఏడాది ఎకరంన్నర భూమిలో పసుపు పంట సాగు చేశా. మొత్తం 30 కింటాళ్లకు పైగా చేతికివచ్చింది. గతేడాది క్వింటాల్ పసుపు రూ.6వేలకే అమ్ముకుని నష్టపోయినా. అందుకే ఈసారి అమ్ముకోవద్దనుకుని ఇంట్లోనే దాచుకున్నా. కొద్దిరోజులుగా పసుపు రేటు పెరుగుతాందని తెలిసి గురువారం 40 కింటాళ్ల పసుపును కేసముద్రం మార్కెట్‌కు తీసుకువచ్చా. నేను తెచ్చిన కాడిరకం పసుపుకు రూ.12,213 ధర పలికింది. ముందుజాగ్రత్తతో దాచుకోవడం వల్లే ధర కలిసొచ్చింది. ఇన్నేళ్ల తర్వాత ధర పెరగడం ఆనందంగా ఉంది.

-గుగులోతు శంకర్, రైతు, పీన్యాతండా, మదనతుర్తి, నెల్లికుదురు మండలం

# దాతలు దయచూపరూ!

- నిట్‌లో సీటు సాధించిన నిరుపేద విద్యార్థి సన్నీ
- ఆర్థిక సాయం చేయాలని తల్లిదండ్రుల వేడుకోలు
- 10తేదీలోగా కాలేజీలో ప్రవేశానికి డెడ్‌లైన్


కన్నీటి గాథ


సన్నీ

చెన్నారావుపేట : కడుపేదరికం.. రెక్కాడితేకాని డొక్కాడని కుటుంబం.. కూలీకి వెళ్తేనే కూడు. లేనిపక్షంలో కుటుంబ మొత్తం ఆకలికి అలమటించుడే. ఇలాంటి పరిస్థితి ఉన్నా ఓ విద్యార్థి పట్టుదలతో చదివాడు. అనుకున్న లక్ష్యం చేరుకున్నాడు. అయితే ఉన్నత చదువుకు లక్ష్మీ కటాక్షం లేక ఓ నిరుపేద విద్యార్థి ఇబ్బందులు పడుతున్నాడు. ఎవరైన ఆర్థిక సాయం అందిస్తే ఉన్నతంగా చదువుకుంటానని పేర్కొంటున్నాడు. దాతల సాయం కోసం వేయికండ్లతో ఎదురుచూస్తున్నాడు. వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం బాపునగర్ గ్రామానికి చెందిన మంతెన ప్రభుదాస్, స్వప్న దంపతులకు ముగ్గురు కుమారులు. రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబం. వ్యవసాయ కూలి పనులకు వెళ్లి కుమారులను పోషించుకుంటున్నారు. పెద్ద కుమారుడు సన్నీ స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 4వ తరగతి వరకు చదువుకున్నాడు. 5వ నుంచి 10వ తరగతి వరకు మరిపెడలోని సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో చదువుకున్నాడు. ఇంటర్ ఎంపీసీ రాంపూర్‌లోని సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో చదువుకున్నాడు. బీటెక్ చదవడానికి ఎంసెట్ రాశాడు. అలాగే, జేఈఈ మెయిన్స్ రాయడంతో పశ్చిమ బెంగాల్‌లోని దుర్గాపూర్ నిట్ కళాశాలలో ప్రవేశం వచ్చినట్లు మెయిల్‌ద్వారా సమాచారం పంపించారు. దీంతో తనను ఎలాగైనా చదివించాలని తల్లిదండ్రులను ఒప్పించాడు. అప్పుతెచ్చి రూ. 20 వేలు ప్రవేశం కోసం ఆన్‌లైన్ ఫీజు చెల్లించారు. కళాశాలలో చేరగానే మరో రూ. 36 వేలు చెల్లించాలని తెలిపినట్లు చెప్పారు. అంతేకాకుండా సుమారు రూ. లక్షకు పైగా ఖర్చు అవుతుందని, చేతిలో డబ్బు లేక చదువు ఆపేయాల్సి వస్తుందని విద్యార్థి సన్నీ మనోవేదన చెందుతున్నాడు. పట్టుదలతో చదవగా సీటు వచ్చినా లక్ష్మీకటాక్షం లేకపోవడంతో కుమారుడి పరిస్థితి చూసి తల్లిదండ్రులు ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్నారు. ఈనెల 10 తేదీ వరకు కళాశాలలో చేరాలని సమాచారం అందించడంతో వారికి వేదన ఎక్కువైంది. దీనిపై దాతలు స్పందించి ఆర్థిక సాయం అందించాలని సన్నీతోపాటు తల్లిదండ్రులు వేడుకుకుంటున్నారు.

**దాతలు 9052001950 ప్రభుదాస్, చెన్నారావుపేట ఎస్‌బీఐ అకౌంట్ నంబర్ 62202764705, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ ఎస్‌బీఐఎన్ 0021352కి సాయం అందించాలని కోరారు.**

# కష్టపడితే అత్యుత్తమ ఫలితాలు

- ఎస్సార్ యూనివర్సిటీ చాన్స్‌లర్ ఎ.వరదారెడ్డి


జ్యోతిప్రజ్వలన చేస్తున్న ఎ. వరదారెడ్డి

హసన్‌పర్తి: కష్టపడితే అత్యుత్తమ ఫలితాలు సాధించొచ్చని ఎస్సార్ యూనివర్సిటీ చాన్స్‌లర్ ఎ.వరదారెడ్డి అన్నారు. ఎస్సార్ యూనివర్సిటీ బి.టెక్ మొదటి సంవత్సరంలో ప్రవేశం పొందిన విద్యార్థులకు గువారం ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సమావేశానికి వరదారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ ప్రయోజనాల కోసం భారతదేశ ప్రతిభను అభివృద్ధి చేయడానికి సార్వత్రిక నాణ్యమైన విద్య ఉత్తమ మార్గమన్నారు. సాంకేతిక సంబంధిత సామాజిక స్పృహ కలిగిన భావితరాన్ని తయారు చేసేందుకు ఎస్సార్ యూనివర్సిటీ కృషి చేస్తోందన్నారు. యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ దీపక్ గార్గ్ మాట్లాడుతూ మార్పులకనుగుణంగా విద్యార్థులు తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. విద్యార్థులు రోజూ ఒక కొత్త విషయం నేర్చుకోవాలని సూచించారు. రిజిస్ట్రార్ డాక్టర్ అర్చనారెడ్డి మాట్లాడుతూ 21వ శతాబ్దపు ప్రపంచీకరణ ప్రపంచంలో సరిపోయ్యేలా పాఠ్యప్రణాళిక మార్పులను తీసుకొచ్చినట్లు వివరించారు. దీని అమలు వల్ల విద్యార్థులను అధిక వేతన ప్యాకేజీలతో మంచి కంపెనీల్లో పనిచేయడానికి వీలు కలుగుతుందన్నారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి సమావేశాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాలకు చెందిన అధ్యాపకులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# ద్విచక్రవాహనాల దొంగ అరెస్ట్

- 8 బైక్‌లు స్వాధీనం
- నిందితుడు మైనర్


స్వాధీనం చేసుకున్న బైక్‌లను చూపుతున్న ఏసీపీ

కమలాపూర్: ద్విచక్రవాహనాల చోరీకి పాల్పడుతున్న కమలాపూర్ మండలం గూడూరుకు చెందిన ఓ దొంగ (15)ను అరెస్ట్ చేసి నిందితుడి వద్ద నుంచి ఎనిమిది బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు కాజీపేట ఏసీపీ పి.డేవిడ్‌రాజ్ తెలిపారు. కమలాపూర్ పోలీస్ స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. కమలాపూర్ మండలం గూడూరు క్రాస్ రోడ్డులో గురువారం ఇన్‌స్పెక్టర్ సంజీవ్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టగా గూడూరుకు చెందిన ఓ బాలుడు (15) అనుమానాస్పదంగా తిరుగుతూ కనిపించాడు. అనుమానం వచ్చిన పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా ద్విచక్రవాహనాల చోరీకి పాల్పడినట్లు అంగీకరించాడని తెలిపారు. నిందితుడి వద్ద నుంచి నాలుగు టీవీఎస్ ఎక్సెల్, ఒక గ్లామర్, ఒక స్ప్లెండర్ ప్లస్, ఒక హీరోహోండా, ఒక సీడీ డాన్, తదితర ఎనిమిది ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకుని బాల నేరస్తుడిని జువైనల్ కోర్టులో హాజరు పర్చి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు. కాగా, ద్విచక్రవాహనాల చోరీ కేసును చేధించడంలో ప్రతిభ కనబర్చిన ఎస్సైలు చరణ్, సతీష్, సిబ్బంది సురేందర్, ప్రసన్నకుమార్‌ను ఏసీపీ అభినందించడంతో పాటు రివార్డులు అందజేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఇన్‌స్పెక్టర్ సంజీవ్, ఎస్సై సీమా ఫర్హీన్, సిబ్బంది పాల్గొన్నారు.

# సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచుకోవాలి

- ఇస్రో మాజీ సీనియర్ సైంటిస్ట్ కంజిలాల్


మాట్లాడుతున్న కంజిలాల్

హన్మకొండ అర్బన్: విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవాలని ఇస్రో మాజీ సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ అపూర్వ కంజిలాల్ అన్నారు. గురువారం నగరంలోని పింగిళి ప్రభుత్వ మహిళ కళాశాలలో ప్రిన్సిపాల్ చంద్రమౌళి అధ్యక్షతన కళాశాల భౌతిక శాస్త్ర విభాగం, ఐక్యూఏసీ ఆధ్వర్యంలో 'చంద్రుడిపై భారతదేశ యాత్ర చంద్రయాన్' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు కంజిలాల్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం అన్ని సబ్జెక్టుల విద్యార్థులకు అవసరమన్నారు. పోటీ పరీక్షల్లో విజయం సాధించాలంటే విద్యార్థులకు సైన్స్‌పై కనీస అవగాహన ఉండాలన్నారు. జూలై 14 శ్రీహరికోట అంతరిక్ష కేంద్రం నుంచి ప్రయోగించిన చంద్రయాన్ -3 ఆగస్టు 23న రోవర్ చంద్రుడిపై ల్యాండ్ అవకాశం ఉందని తెలిపారు. చంద్రయాన్ -3 ముఖ్య లక్ష్యాలు చంద్రుడి కూర్పు అర్థం చేసుకోవడం, చంద్రుడి ఉపరితలంపై లభ్యమయ్యే రసాయనాలు, సహజ మూలకాలు, నేల, నీరు తదితర అంశాలపై అక్కడే శాస్త్రీయ ప్రయోగాలు, పరిశీలనలు చేయడమన్నారు. ఈ సందర్భంగా భారతదేశ అంతరిక్ష తొలి ప్రస్థానం నుంచి నేటి వరకు జరిగిన పరిణామాల గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జి.సుహాసిని, పరీక్షల నియంత్రణాధికారి డి.రామకృష్ణారెడ్డి, అకడామిక్ కోఆర్డినేటర్ డి.పార్వతి, భౌతిక శాస్త్ర విభాగాధిపతి సీహెచ్ స్నేహలతారెడ్డి, విభాగ అధ్యాపకురాలు ఎస్.కిరణ్మయి, తదితరులు పాల్గొన్నారు.

# బతకలేక.. బలవన్మరణం

**వివిధ కారణాలతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో ముగ్గురు బలవన్మరణానికి పాల్పడ్డారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం పెద్దంపల్లిలో ఒకరు, గార్ల మండలం పుల్లూరు గ్రామంలో మరొకరు, నర్సింహులపేట మండలం బుద్దతండాలో ఇంకొకరు తనువు చాలించారు. దీంతో ఆయా కుటుంబాలు దుఃఖ సాగరంలో మునిగాయి.**

### జీవితంపై విరక్తి చెంది ఒకరి ఆత్మహత్య

టేకుమట్ల(రేగొండ): జీవితంపై విరక్తి చెందిన ఓ వ్యక్తి.. పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం పెద్దంపల్లిలో జరిగింది. గ్రామానికి చెందిన కోడెపాక రాజేశం(52) మద్యానికి బానిసై ఇంట్లో గొడవ చేస్తుండడంతో పాటు డబ్బు కావాలని కుటుంబీకులను వేధిస్తున్నాడు. ఈ నెల 1వ తేదీన కూడా మద్యానికి డబ్బు కావాలని వేధించగా వారు నిరాకరించారు. దీంతో అదే రోజు ఇంటి నుంచి బయటకు వచ్చిన రాజేశం మండల కేంద్రంలో బత్తుల వెంకటేశ్వర్లుకు చెందిన వ్యవసాయ భూమిలో పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గురువారం మృతదేహాన్ని గుర్తించిన రైతు.. పోలీసులకు సమాచారం అందించడంతో వారు అక్కడికి చేరుకుని రాజేశంగా గుర్తించారు. దీనిపై మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రెండో ట్రైనీ ఎస్సై తీగల మాధవ్‌గౌడ్ తెలిపారు.

### పుల్లూరు గ్రామంలో మరొకరు..


రాము (ఫైల్)

గార్ల: జీవితంపై విరక్తి చెందిన ఓ వ్యక్తి.. పురుగుమందు సేవించి ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన గార్ల మండలం పుల్లూరు గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన భూక్యా రాము(35) మద్యం కోసం డబ్బు ఇమ్మని తరచూ భార్యను వేధిస్తున్నాడు. బుధవారం కూడా వేధించడంతో ఆమె అదే గ్రామంలోని పుట్టింటికి వెళ్లింది. దీంతో జీవితంపై విరక్తి చెందిన రాము పురుగుల మందు సేవించి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన స్థానికులు క్షతగాత్రుడిని గార్ల సీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స అనంతరం మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతిచెందాడు. మృతుడి భార్య విజయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై కె వీరారెడ్డి తెలిపారు.

### బుడ్డతండాలో కుటుంబ కలహాలతో ఇంకొకరు..

నర్సింహులపేట: కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి.. ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని పెద్దనాగారం పరిధిలోని అజ్మీరాతండా శివారు బుడ్డతండాలో జరిగింది. తండాకు చెందిన బానోతు మోహన్(30) ఇంట్లో కొంతకాలంగా కుటుంబ కలహాలు జరుగుతున్నారు. దీంతో మనస్తాపం చెందిన ఆయన గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనిపై మృతుడి తల్లి కౌసల్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సతీష్ తెలిపారు.

# అర్హత ఉన్న డ్రైవర్లను నియమించాలి

- డ్రైవర్, క్లీనర్ అసోసియేషన్ ప్రతినిధి బండి భాస్కర్

ఖిలా వరంగల్: హెవీ లైసెన్స్, 3 ఏళ్ల అనుభవం ఉన్న అర్హులైన డ్రైవర్లనే ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాలు నియమించుకోవాలని ప్రైవేట్ విద్యా సంస్థల బస్సుల డ్రైవర్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి బండి భాస్కర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టీఏ నిబంధనలను యాజమాన్యాలు, అధికారులు వదిలేయడం దురదృష్టకరమన్నారు. అర్హతలేని డ్రైవర్ల నియామకం వల్లే ప్రమాదాల జరుగుతున్నాయని, శిక్షణ తరగతులను నిర్వహించడంలో ఆర్టీఏ అధికారులు విఫలమయ్యారని చెప్పారు. ప్రైవేట్ విద్యా సంస్థల బస్సుల ఓనర్స్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గాదే స్వరూప్ రెడ్డి ఆధ్వర్యంలో డీటీసీ, ఎంవీఐ స్థాయి అధికారుల నేతృత్వంలో 2019 విద్యా సంవత్సరం వరకు డ్రైవర్లు, క్లీనర్లకు తాళ్ల పద్మావతి ఇంజనీరింగ్, గణపతి ఇంజనీరింగ్, వాగ్దేవి ఇంజనీరింగ్, జేఎస్ఎం స్కూల్ ప్రాంగణాల్లో శిక్షణ తరగతులు నిర్వహించారని గుర్తు చేశారు. శిక్షణ తరగతులతో డ్రైవర్లల్లో అవగాహన పెరిగి ప్రమాదాల సంఖ్య పూర్తిగా తగ్గిందని తెలిపారు. వేతనం ఎక్కువగా ఇవ్వాల్సి వస్తోందని సీనియర్ బస్సు డ్రైవర్లను పక్కన పెట్టి స్కూల్ యాజమాన్యాలు అవమానిస్తున్నాయన్నారు. అనుభవం లేని డ్రైవర్ల నియామకం, ఆర్టీఏకు ముందు చూపులేక ప్రమాదాలు పెరుగుతున్నాయన్నారు. ఇప్పటికైనా ఆర్టీఏ అధికారులు స్పందించి డ్రైవర్లకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించాలని ఆయన కోరారు.

# రోడ్డు ప్రమాదంలో టీచర్ మృతి


వెంకట్రాంనర్సయ్య (ఫైల్)

గూడూరు: మండలంలోని మర్రిమిట్ట శివారు రాళ్లవాగు సమీపంలోని ఎన్‌హెచ్‌పై ఓ ఎద్దుల బండిని ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ ఘటనలో ప్రభుత్వ తెలుగు పండిట్ అక్కడికక్కడే మృతి చెందాడు. మండల కేంద్రంలోని చెంద్రుగూడేనికి చెందిన మంతెన వెంకట్రాంనర్సయ్య (50) మచ్చర్ల ప్రాథమిక పాఠశాలలో తెలుగు పండిట్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. పని నిమిత్తం బైక్‌పై గురువారం ఉదయం నర్సంపేటకు వెళ్లి తిరిగి గూడూరుకు వస్తున్నాడు. ఈ క్రమంలో ఎదురుగా ఆగి ఉన్న ఎద్దుల బండిని ఢీకొన్నాడు. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు, బాల్య మిత్రులు, బంధువులు బోరున విలపిస్తూ ఘటనా స్థలికి చేరుకున్నారు. వెంకట్రాంనర్సయ్య మృతితో చెంద్రుగూడెంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కాగా, మృతుడికి భార్య స్వరూప, కూతురు, కుమారుడు ఉన్నారు.